క్లుప్తంగా

పాఠశాలలో లెవలింగ్ పనులు



పెళ్లకూరు ప్రభుత్వ పాఠశాలలో లెవలింగ్ పనులు

పెళ్లకూరు: మండల కేంద్రమైన పెళ్లకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం చాగణం లలితమ్మ, భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.1 లక్షకు పైగా సొంత నిధులు వెచ్చించి లెవలింగ్ పనులు చేపట్టారు. ప్రతిఏటా కురిసే వర్షాల కారణంగా పాఠశాల ప్రాంగణంలో వరదనీరు చేరి విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ సమస్యను గుర్తించిన ట్రస్ట్ సీఈవో సీతారామయ్య ట్రస్టీ చాగణం గౌరీశంకర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన 150 ట్రిప్పులు మట్టి కొనుగోలు చేసి పాఠశాల ప్రాంగణంలో లెవలింగ్ పనులు చేపట్టారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ట్రస్ట్ నిర్వాహకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

గిరిజనుల అభివృద్ధికి తోడ్పాటు

పెళ్లకూరు: క్యామెల్ స్వచ్ఛంద సంస్థ ద్వారా గిరిజనుల అభివృద్ధికి తోడ్పాటు అందించడం సంతోషమని స్థానిక ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో క్యామెల్ సంస్థ నిర్వహించిన గిరిజన రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనులకు నేరుగా అందించాలన్నారు. చదువులకు దూరం అవుతున్న గిరిజన పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాల్య వివాహాలపై అవగాహన పెంపొందించి తద్వారా వచ్చే ఇబ్బందులు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, ఏపీఎం మునిరాజ, నాయకులు సంచి కృష్ణయ్య, ప్రసాద్‌నాయుడు, చంద్రయ్య క్యామెల్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాపూరు ఎస్‌ఐగా వెంకటరాజేష్

రాపూరు: మండల ఎస్‌ఐగా వెంకటరాజేష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వీఆర్‌లో ఉండి ఇక్కడ ఎస్‌ఐగా నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న మాల్యాద్రి గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలు పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తామన్నారు. ఆయనకు పోలీసు సిబ్బంది ఘన స్వాగతం పలికారు,

దాతల సహాయం అభినందనీయం

సైదాపురం: దాతల సహాయం అభినందనీయమని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ తెలిపారు. మండలంలోని ఊటుకూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం పాఠశాలకు రూ.80 వేలు విలువ చేసే ఇన్వర్టర్, కంప్యూటర్ పరికరాలను దాతలు అందజేశారు. దాత శ్రీకళ్యాణరామ మైకా మైన్, ఊటుకూరు మాజీ సర్పంచ్ టీవీఎల్ నారాయణరావు సహకారంతో ఈ పరికరాలను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్వీఎస్ శర్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు దయాకర్, సుప్రియ, వైస్ ఎంపిపి భాస్కర్, సర్పంచ్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

దొరవారిసత్రం: నెలబల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై వెళ్తున్న బైక్‌ను వెనుకనే వస్తున్న లారీ ఢీకొడంతో సుమన్ అనే వ్యక్తి గాయపడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు... నాయుడుపేట పట్టణ ప్రాంతంలోని కుమ్మరి వీధికి చెందిన సుమన్ రోజూలాగానే తడ మండలం శ్రీసిటీ పరిధిలోని ఓ కంపెనీలో విధులు నిర్వహించేందుకు బైక్‌పై బయల్దేరాడు. ఈ సమయంలో వెనుకనే వస్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణించే సుమన్ కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్: సూళ్లూరుపేట నియోజవర్గ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తెలిపారు. పుదూరు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపీడీఓ భువనేశ్వరశర్మ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం ప్రజావేదికను నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు నాయకులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

సైదాపురం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్ కోరారు. మండల కేంద్రమైన సైదాపురం ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు ఆడడంతో మానసికోల్లాం కలగడంతో పాటు ఆరోగ్యకరంగా ఉంటారని సూచించారు. అనంతరం అండర్-17 కబడ్డీ పోటీలను నిర్వహించారు.

నాడు సంక్షేమ సంతకం...

నేడు ఆకలి కేకలు



నియోజకవర్గ మేఫెస్టోను విడుదల చేస్తున్న కురుగొండ్ల రామకృష్ణ

- సూపర్‌సిక్స్ అమలు కోసం ప్రజల డిమాండ్
- వందరోజులు గడుస్తున్నా అమలు కాని హామీలు

వెంకటగిరి(సైదాపురం): కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ప్రజా సంక్షేమానికి తొలి సంతకం చేసినా నేటికీ ఆచణ సాధ్యం కాకపోవడంతో వేలాదిమంది గని కార్మికులు ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. చంద్రబాబు నాయుడు మాటల మనిషని గాలిలో మేడలు కట్టే మాయలమారి అని మరోసారి రుజువైందని విశ్లేషకుల మాట. ఎన్నికల ప్రచారంలో భాగంగా జనవరి 19వ తేదీన వెంకటగిరికి విచ్చేసి పలు హామీలను కూడా గుప్పించారు. ఆ సమయంలో మైనింగ్ వ్యవహారంపై కూడా మాట్లాడారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే జూన్ 12వ తేదీ నుండి గనులన్నీ మూత పడ్డాయి. దీంతో ఆ గనుల్లో పని చేసే వేలామంది కార్మికులు ఆకలి కేకలతో అలమటిస్తున్నారు. ఎప్పుడు మైనింగ్‌కు అనుమతిస్తారన్న విషయం కూడా తెలియకపోవడంతో అటు గని యాజమాన్యం ఇటు కార్మికులు ఎదురు చూపులు చూస్తున్నారు. గత 50 ఏళ్లుగా ఎప్పుడు ఇలాంటి పరిస్థితులు తలెత్తలేదని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం స్పందించి మైనింగ్ పరిశ్రమపై కక్షలు వీడి గనులను పునరుద్ధరించాలని కార్మికులు కోరుతున్నారు.

అధికారం చేపట్టి 100 రోజులు అవుతున్నా కూడా ఈ హామీల్లో కేవలం వెంకటగిరి-గూడూరు రోడ్డు అభివృద్ధి చేసే కొంతమేరకు మాత్రమే చర్యలు చేపట్టారు. సైదాపురం-డేగపూడి మార్గంలో ఉన్న రహదారిపై ప్రయాణించాలంటే వాహన చోదకులు హడలిపోతున్నారు. మిగిలిన హామీలన్నీ ప్రచార ఆర్భాటాలకే పరిమితమవుతాయా లేక అమలు చేస్తారా అని నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్నారు.

కురుగొండ్ల హామీలు నెరవేరేనా?

ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం హామీలు కాకుండా వెంకటగిరి టీడీపీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పలు హామీలను మేనిఫెస్టో రూపంలో విడుదల చేశారు.

- ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులు పూర్తిచేసి ప్రజలకు సాగు, తాగునీరు అందిస్తాం.
- సీహెచ్‌సీ వైద్యశాలను 100 పడకల అధునాతనమైన వైద్యశాలగా అభివృద్ధి చేయడం.
- చేనేత కార్మికులకు 200 యూనిట్స్ విద్యుత్ సరఫరా, ఏడాదికి రూ.24 వేలు నగదు జమ.
- వెంకటగిరి–గూడూరు, సైదాపురం–డేగపూడి మార్గాల్లో రోడ్లను బాగుచేయడం.
- వెంకటగిరిలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయడం.
- మహిళలకు మెరుగైన ప్రసూతి సేవలు అందించేందుకు ఘోషా ఆసుపత్రిని పునర్నిర్మాణానికి చర్యలు.
- కిడ్నీ వ్యాధిగ్రస్తులకు వెంకటగిరిలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు.
- నిరుద్యోగ యువతకు ఎంప్లాయిమెంట్ సెంటర్ ఏర్పాటు.
- కండలేరును మరింత అభివృద్ధి చేయడం, ఎస్ఏఎస్ కెనాల్ పనులు పూర్తిచేయడం.

ఆకలికేకలతో అలమటిస్తున్నా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆకలి కేకలతో అలమటిస్తున్నాం. జూన్ 12వ తేదీ నుండి నేటి వరకు పనులు లేక వీధిన పడ్డాం. మా ఊరి దగ్గరలోనే ఉన్న ఓ గనిలో గత 45ఏళ్లుగా కూలీ పనులు చేసుకుని సంతోషంగా జీవనం సాగించేవారం. ఈ ప్రభుత్వం వచ్చాక గనులన్నీ మూతవేశారు. 90 రోజులుగా పనులు లేక అల్లాడిపోతున్నాం. తిండికి కూడా కష్టంగా మారింది.

- రాజమ్మ, గని కార్మికురాలు, తలుపూరుగ్రామం, సైదాపురం మండలం.

నరకప్రాయమైన రహదారి



సైదాపురం-డేగపూడి మార్గంలో ప్రయాణించాలంటే నరకంగా ఉంటుంది. అడుగడుక్కి గుంతలు, దుమ్ము, ధూళితో అస్తవ్యస్తంగా ఉంది. దీంతో ద్విచక్ర వాహనం, ఏ ఇతర వాహనంలో ప్రయాణం చేసినా సురక్షితంగా గమ్యం చేరాలనుకుంటే గగనంగా మారుతోంది. ఈ మార్గంలో నిత్యం ప్రమాదాలకు గురై ప్రజలు ఇబ్బందులు పడుతున్నాం. పాలకులు స్పందించి రోడ్డును వెంటనే బాగుచేయాలి.

-తిరకాల భాస్కర్, వైస్ ఎంపీపీ, ఊటుకూరు, సైదాపురం మండలం

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో మేలు



కూరగాయల దుకాణాన్ని ప్రారంభిస్తున్న మహిళా రైతు

చిల్లకూరు: ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసి పండించే ఆకు కూరలు, కూరగాయలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని డివిజన్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాధికారి మధు అన్నారు. కడివేడు, నెలబల్లిరెట్టపల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ బృందం ద్వారా చిన్న కారు రైతులు తమకు ఉన్న 20, సెంట్లు, 50 సెంట్ల భూమిలో సాగు చేసిన కూరగాయలు, ఆకుకూరల దుకాణాలను శుక్రవారం ఆరంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న కారు రైతులకు ఆదాయం సమకూర్చే విధంగా ప్రకృతి వ్యవసాయంలో ప్రోత్సహించామన్నారు. ఇలా పండించిన ఆకు కూరలు, కూరగాయలు మంచి ధరలు పలుకుతాయని తెలిపారు. దీంతో బూదనం గ్రామానికి చెందిన వజ్రమ్మ ఏ గ్రేడ్ మోడల్ కూరగాయలు పండించిందని పేర్కొన్నారు. అలాగే కడివేడు యూనిట్ ఇన్‌చార్జ్ పూర్ణిమ సొంత పొలంలో 26 రకాల విత్తనాలను సాగు చేయడం మొదలు పెట్టారన్నారు. దీని ద్వారా వచ్చిన దిగుబడిని దుకాణంలో వారే విక్రయించుకుని సొమ్ము చేసుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ మనోహర్, క్రిష్ణ, తిరుమల, వీరరాఘవయ్య, ధనుంజయ, నారాయణమ్మ, పూర్ణిమ, క్రిష్ణయ్యలు పాల్గొన్నారు.

కండలేరులో 16.444 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 16.444 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8300 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. అలాగే సత్యసాయిగంగ కాలువకు 370, పిన్నేరు కాలువకు 40, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రీడలతో బహుళ ప్రయోజనాలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీఓ రజనీకాంత్

వాకాడు: క్రీడలతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చునని ఎంపీడీఓ మనోహర్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మండల కేంద్రం వాకాడులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ క్రీడల వలన మానసిక వికాసం, క్రమశిక్షణతోపాటు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్ తదితర బహుళ ప్రయోజనాలు లభిస్తాయన్నారు. స్కూల్ గేమ్స్‌లో మండల స్థాయిలో ప్రతిభ సాధించిన క్రీడాకారులను డివిజన్ స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామానుజాచారి, పీఈటీ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఓజిలి: క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహద పడుతాయని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. ఓజిలి ఉన్నత పాఠశాలలో 68వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను ఎంఈఓ శైలజ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. ముందుగా మండలంలోని అన్ని పాఠశాలల నుంచి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడాకారులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించారు. క్రీడాపోటీలకు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను వెలికితీసి జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలకు పంపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు ధీటుగా విద్యాబోధనలో ముందుకు వెళ్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ మోహన్, క్రీడాపోటీల కోఆర్డినేటర్ శ్రీహరిబాబు, ప్రధానోపాధ్యాయిని మంజుల, ఎస్ఎంసీ చైర్మన్ అనిత తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

పెళ్లకూరు: విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లో రాణించాలని స్థానిక ఎంపీఈవో సురేష్‌బాబు సూచించారు. శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పెళ్లకూరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీపీ శేఖర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య చేతులమీదుగా క్రీడలను ప్రారంభించారు. విద్యార్థులు చదువులతోపాటు శారీరక వ్యాయా మం అవసరమని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు తమకు ఇష్టమైన క్రీడల్లో అంతర్జాతీయ గుర్తింపు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

చిల్లకూరు: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కింద అండర్-14, అండర్-17 విభాగాల్లో వివిధ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి సనత్‌కుమార్ తెలిపారు. చిల్లకూరు మండలంలోని 9 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పలు క్రీడా పోటీలలో పాల్గొనేందుకు తరలివచ్చారు. చిల్లకూరు జిల్లా పరిషత్ క్రీడా మైదానంలో శుక్రవారం క్రీడాకారుల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతి వెలిగించి వివిధ రకాల క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం తొలుత పరుగు పందెంను జెండా ఊపి ఆరంభించారు. మండల స్థాయిలో ఎంపికైన వారు, నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 రవూఫ్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బయో ఇథనాల్ పరిశ్రమ కోసం స్థల పరిశీలన



అధికారుల బృందానికి స్వాగతం పలుకుతున్న ఆర్డీఓ తదితరులు

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని మేనకూరు సెజ్‌లో బయో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు కోసం శుక్రవారం స్థల పరిశీలన చేపట్టారు. బాల్‌మోర్ లేరీ అండ్ కంపెనీ(సీపీఎస్ఈయూ)లిమిటెడ్ ఇండియా డైరెక్టర్ ఆర్ఎం ఉత్తరియా రాజా, అధికార బృందంతో కలిసి పరిశీలించారు. మేనకూరు సెజ్ పరిధిలో కేంద్ర ప్రభుత్వ సంస్థకు చెందిన బయో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు కోసం 36 ఎకరాలను ఏపీఐఐసీ వారు కేటాయించారు. ఆ స్థలాన్ని ఆ సంస్థ అధికారులతో కలిసి పరిశీలించారు. సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని, తహసీల్దార్ గీతావాణి, డీటీ రాజేంద్ర పాల్గొన్నారు.


ఉపాధి పనులు అందరికీ కల్పించాలి

గూడూరు రూరల్: రూరల్ ప్రాంతాల్లో చేపడుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ప్రతి కుటుంబానికి అందేలా చూడాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో శుక్రవారం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాదిలో 200 రోజుల పాటుగా ఉపాధి పనులు కల్పించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే రూ.600 వరకు వేతనాలు అందించేలా జీఓలను సరి చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి జాబ్ కార్డులు అందించాలని తెలిపారు. అనంతరం గూడూరు వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని 21 మందితో ఎంపిక చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటయ్య, నారాయణను ఎన్నుకున్నారు.

23 నుంచి స్కూల్ గేమ్స్

చిట్టమూరు(వాకాడు): చిట్టమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 23 నుంచి మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలు నిర్వహిస్తామని ఎంఈఓ బీవీ కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం తన కార్యాలయంలో మాట్లాడుతూ జడ్పీ హైస్కూల్లో నిర్వహించే మండల స్థాయి క్రీడల్లో 14 నుంచి 17 సంవత్సరాల మధ్య వయసు బాలబాలికలకు ఎంపికలు ఉంటాయి.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి



కలవకొండలో మొక్కలు నాటుతున్న అధికారులు

చిల్లకూరు: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ద్వారా పరిసరాలు పరిశుభ్రంగా మారుతున్నాయని ఈఓపీఆర్‌డీ మాణిక్యం అన్నారు. మండలంలో జరుగుతున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన తిక్కవరం, కలవకొండ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడమే కాకుండా చెత్తను తొలగించి మొక్కలు నాటించారు. కలవకొండ గ్రామంలో పాఠశాల, పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం ఇస్తున్న నిధులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గ్రామాల ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించుకోవాలన్నారు. ఆయన వెంట ఆయా పంచాయతీ కార్యదర్శులు, రమణయ్య, దివ్య, సర్పంచ్‌లు సుభాషిణి, సతీష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వంద రోజుల పాలన...

అక్రమాలమయం



గూడూరు ఎన్నికల ప్రచారంలో హామీలు ఇస్తున్న చంద్రబాబు



కాకువారిపాలెంలో నిరుద్యోగ భృతిపై హామీ ఇస్తున్న నారా లోకేష్

- నెరవేరని హామీలు

చిల్లకూరు: గూడూరు నియోజకవర్గంలో ఎన్నికలకు ముందు టీడీపీ ప్రచారంలో, చినబాబు చేపట్టిన యువగళం పాదయాత్రలో ఇచ్చిన ఒక్క హామీ కూడా వంద రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం నెరవేర్చలేక పోయింది. అంతేకాకుండా అక్రమాలతో శత దిన పాలన పూర్తి చేసుకున్నారు. 2023 జూన్ నెలలో చినబాబు చేపట్టిన యువగళం పాదయాత్రలో భాగంగా చిట్టమూరు, వాకాడు, కోట మండలాల మీదుగా చిల్లకూరు మండలం కాకువారిపాళెం గ్రామంలో బస చేశారు. అక్కడ నియోజకవర్గంలోని పలు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన విద్యార్థులతో సమావేశమయ్యారు. అధికారం చేపట్టిన వెంటనే నిరుద్యోగ భృతి అందించేలా హామీ ఇచ్చారు. అలాగే పలు పరిశ్రమలను తీసుకుని వచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే నియోజకవర్గంలో ఒక్క పరిశ్రమ రాకపోగా నిరుద్యోగులకు భృతి అందని ద్రాక్షలా మారింది. అలాగే ఎన్నికల సమయంలో స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రచారంలో భాగంగా గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. రైల్వే స్టేషన్‌కు ఇరువైపులా ఉన్న గూడూరు రెండు పట్టణాలను కలిపేలా ఉన్న ఆర్ఓబ్రిడ్జిని పూర్తి చేయించి ప్రజలకు అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. దీనిపై ఇప్పటి వరకు ఒక్క అడుగు కూడా ముందుకు కదలని పరిస్థితి. గతంలో మున్సిపల్ చైర్మన్‌గా ఉన్నప్పుడు పట్టణవాసులకు రెండు పూటలా తాగునీరు అందించారు. అయితే నేడు ఆ పరిస్థితి లేకపోయింది. ఎన్నికల హామీలలో భాగంగా ఎమ్మెల్యే రెండు పూటలా తాగునీరు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. అయితే అది కూడా ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. ఇచ్చిన హామీలు ఎప్పటికి నెరవేరుస్తారో చూడాలి మరి.

అధికారం చేపట్టిన నాటి నుంచే అక్రమాలు

ఎక్కడైనా గ్రావెల్, ఇసుక, మట్టి అక్రమ తవ్వకాలు చేపట్టినట్లు తెలిస్తే తాట తీస్తామని సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయించుకున్నారు. అయితే అధికారం చేపట్టిన నాటి నుంచి గూడూరు నియోజకవర్గంలో ఉన్న మండలాలను భాగాలు వేసి పెత్తనం ఒక్కొక్కరి చేతికి ఇచ్చి అక్రమంగా గ్రావెల్, మట్టి, ఇసుక తవ్వకాలను ఇష్టానుసారంగా చేపడుతున్నారు. పేదలు ఇల్లు కట్టుకునేందుకు బేస్‌లోకి అవసరమైన మట్టిని తవ్వుకుందామన్నా అధికారులు మాదేమీ లేదు టీడీపీ నేతలను అడగాలని అంటుండడం కూటమి పాలన అక్రమాలకు అద్దం పడుతోంది.

ముమ్మరంగా పారిశుధ్య పనులు



మురుగు తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు

వెంకటగిరి(సైదాపురం): రాష్ట్ర పండుగ హోదాలో వెంకటగిరిలో జరగనున్న శ్రీపోలేరమ్మ తల్లి జాతరకు సంబంధించి వెంకటగిరి మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తమై పారిశుధ్యం పనులు ముమ్మరంగా సాగిస్తున్నారు. వార్డుల్లో డ్రైనేజీల్లో పేరుకుపోయిన వ్యర్థాలను శుభ్రం చేయడంతోపాటు ప్రధాన మార్గాల్లో నిల్వ ఉన్న చెత్తాచెదారాలను ఎక్కడికక్కడ శుభ్రం చేస్తున్నారు. జాతర సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఉండేలా అధికారులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్‌లైన్లను మరమ్మతులు చేస్తున్నారు. లో అండ్ హై వోల్టేజీ సమస్యలు లేకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే పలు వార్డుల్లో వెలగని వీధిలైట్లను మరమ్మతులు చేసి ప్రతి ప్రాంతంలో లైట్లు వెలిగేలా చర్యలు చేడుతున్నారు.

తమిళ రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన రేషన్ బియ్యం లారీలు

తడ: తమిళనాడు నుంచి ఆంధ్రప్రదేశ్‌లోకి అక్రమంగా చేర్చి రవాణాకు సిద్ధం చేస్తున్న తమిళనాడుకు చెందిన రేషన్ బియ్యాన్ని పోలీసులు, సివిల్ సప్లయ్ అధికారులు గురువారం రాత్రి పట్టుకున్నారు. ఎస్ఐ కొండపనాయుడు కథనం మేరకు.. అక్కంపేట గ్రామం వద్ద రేషన్ బియ్యం భారీగా నిల్వ చేసి తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో సివిల్ సప్లయ్ డీటీ ఓబయ్యకు సమాచారం ఇచ్చి సిబ్బందితో కలసి దాడులు చేశారు. ఆ సమయంలో బస్తాల లోడ్‌తో ఉన్న లారీతోపాటు సగం లోడ్‌తో ఉన్న మరో లారీని స్వాధీనం చేసుకున్నారు. లారీలతో పాటు తూర్పుగోదావరి జిల్లాకు చెందిన చంద్రశేఖర్‌రావు, దుర్గారెడ్డి అనే ఇద్దరు లారీ డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. 41,950 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.12,58,500గా నిర్ధారించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని కొండూరు వద్ద ఉన్న సివిల్ సప్లయ్ గోదాముకు తరలించారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన లారీ ఓనర్ వెంకటరెడ్డి, వాటంబేడు గ్రామానికి చెందిన బియ్యం స్మగ్లర్లు ప్రసాద్, మణికంఠపై కేసు నమోదు చేశారు.

వరద బాధితులకు పాస్టర్స్ అసోసియేషన్ సాయం



సహాయ సామగ్రి అందిస్తున్న పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు

గూడూరు రూరల్: పాస్టర్స్ అసోసియేషన్ ద్వారా విజయవాడ ప్రాంతంలోని వరద బాధితులకు శుక్రవారం సహాయం అందించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు వూలా డేనియల్ రవికుమార్ మాట్లాడుతూ వరద బాధితులకు పలు చర్చిలలో తమ వంతు సాయంగా బియ్యం, ఫల సరుకులు, దుప్పట్లు, వంట పాత్రలు ఇచ్చామన్నారు. వీటిని నేరుగా బాధితులకు అందించేందుకు పాస్టర్స్ అసోసియేషన్ సభ్యులు లారీలలో విజయవాడకు తరలించామన్నారు. పాల్‌కుమార్, తడకు చెందిన మోజెస్, నాయుడుపేటకు చెందిన శరత్‌బాబు సరుకులు అందించడంలో సాయం చేశారన్నారు. పోలూరుకు చెందిన నెల్సన్, గూడూరుకు చెందిన రవి, కోటకు చెందిన ఆశా మీనస్, బ్రదర్ టీజే మార్క్, పాల్గొన్నారు.

ఆల్తూరుపాడు రైల్వే స్టేషన్ తనిఖీ



ఆల్తూరుపాడులో వివరాలు తెలుసుకుంటున్న జేసీ, సబ్ కలెక్టర్

డక్కిలి: మండలంలోని ఆల్తూరుపాడు రైల్వే స్టేషన్‌ను తిరుపతి జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సల్, గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆల్తూరుపాడు, వెల్లంపల్లి, చీకిరేణిపల్లి గ్రామాల్లో రైల్వే నిర్మాణ పనుల్లో భూములు కోల్పోయే డీకేటీ రైతుల జాబితాను త్వరితగతిన సిద్ధ చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు 61 ఎకరాలకు సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం అందజేశామని తెలిపారు. ఇంకా 105 ఎకరాలకు సంబంధించి పరిహారం అందేలా చూస్తామని తెలిపారు. ఆల్తూరుపాడు రిజర్వాయర్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కండలేరు నుండి శ్రీసిటీకి వెళ్లే పైప్‌లైన్‌కు సంబంధించి మార్లగుంట, వెలికల్లు, కందలవారిపల్లి గ్రామాలను సందర్శించారు. ఈ పైప్‌లైన్ నిర్మాణంలో ఆలయాలు, ఇళ్ల ప్రహరీలు కోల్పోయే జాబితాను తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.